క్లుప్తంగా

ఉచిత దంత వైద్య శిబిరం

తిరుపతి ఎడ్యుకేషన్: తిరుపతి చిన్న బజారు వీధిలోని ప్రభుత్వ బాలికల ఉన్నత పాఠశాలలో శనివారం ఎస్వీ వైద్య కళాశాల ఆధ్వర్యంలో ఉచిత దంత వైద్య శిబిరం నిర్వహించారు. దంత విభాగాధిపతి డాక్టర్ స్వప్న ప్రియ, వైద్య సిబ్బంది విద్యార్థినులకు దంత పరీక్షలు చేశారు. వైద్య కళాశాల ప్రిన్సిపాల్ చంద్రశేఖరన్, డీఈఓ వి.శేఖర్, హెచ్ఎం వెంకటసుబ్బమ్మ పాల్గొన్నారు.

అభివృద్ధి పనులు వేగవంతం

భాకరాపేట: చిన్నగొట్టిగల్లు మండలంలో రూ.25 కోట్లతో చేపట్టిన అభివృద్ధి పనులను వేగవంతం చేయాలని ఎంపీడీవో దేవేంద్ర బాబు ఆదేశించారు. ఆయన శనివారం మండల, సచివాలయ ఇంజినీరింగ్ అధికారులతో సమావేశమయ్యారు.

ప్రజా సంక్షేమానికి పెద్దపీట

భాకరాపేట: జగనన్న ప్రభుత్వం ప్రజా సంక్షేమానికి పెద్దపీట వేసిందని వైఎస్సార్ సీపీ చిన్నగొట్టిగల్లు మండల అధ్యక్షుడు కొండారెడ్డి తెలిపారు. ఆయన శనివారం పార్టీ మండల కార్యాలయంలో కార్యకర్తలతో సమావేశమయ్యారు. జగనన్న అన్ని వర్గాల ప్రజలకు న్యాయం చేస్తున్నారని తెలిపారు. డివిజన్ పార్టీ అధ్యక్షులు, పంచాయతీ స్థాయి నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు.

అవకాశాలను అందిపుచ్చుకోవాలి



విద్యాసామగ్రి అందజేస్తున్న దివాకర్‌రెడ్డి

రామచంద్రాపురం: విద్యార్థులు అవకాశాలను అందిపుచ్చుకుని ఉన్నత శిఖరాలు చేరుకోవాలని డాలర్స్ గ్రూప్ ఆఫ్ కంపెనీ అధినేత దివాకర్‌రెడ్డి తెలిపారు. ఆయన శనివారం కమ్మకండ్రిగ, నెత్తకుప్పం, కుప్పంబాదూరు, కేకేవీపురం, సొరకాయలపాలెం, పరమాల, అనుప్పల్లి, ఎస్ఆర్ కమ్మపల్లి, జీహెచ్ఎస్ కమ్మపల్లి ప్రభుత్వ ఉన్నత పాఠశాలల్లో పదో తరగతి చదువుతున్న విద్యార్థులకు విద్యాసామగ్రి అందజేశారు. ఆర్గనైజర్ యుగంధర్‌రెడ్డి, హెచ్ఎంలు దామోదరం, వాగ్దేవి పాల్గొన్నారు.

వకుళమాత సేవలో కమెడియన్ శ్రీను



తిరుపతి రూరల్: పేరూరు బండపై కొలువైన వకుళ మాతను శనివారం సినీనటుడు, కమెడియన్ శ్రీను కుటుంబ సభ్యులతో కలిసి దర్శించుకున్నారు. వారికి టెంపుల్ ఇన్‌స్పెక్టర్ శివకుమార్ స్వాగతం పలికి దర్శనం కల్పించారు.

చర్చలు లేకుండానే ముగిసిన మండల సమావేశం

రామచంద్రాపురం: ఎన్నికల నియమావళి అమలులో ఉండడంతో శనివారం మండల సమావేశం చర్చలు చేపట్టకుండా ముగించారు. ఎంపీపీ ఏవీ బ్రహ్మానందరెడ్డి అధ్యక్షతన మండల సాధారణ సర్వసభ్య సమావేశం నిర్వహించారు. ఎంపీడీఓ మహ్మద్ రఫీ ఎన్నికల ప్రొటోకాల్‌ను అనుసరించి సమావేశాన్ని ప్రారంభించి ముగించారు.

పాడిపశువుల పెంపకంలో జాగ్రత్తలు అవసరం



మహిళలకు అవగాహన కల్పిస్తున్న సుజాత

పాకాల: పాడి పశువుల పెంపకంలో తగిన జాగ్రత్తలు తీసుకోవాలని తిరుపతి ఎస్వీ వెటర్నరీ వర్సిటీ పశువైద్య విద్య, సమాచార సమన్వయకర్త కె.సుజాత తెలిపారు. అడుసుపల్లిలో శనివారం పాడి రైతులకు పాడి పశువుల పెంపకంలో తీసుకోవాల్సిన జాగ్రత్తలపై అవగాహన కల్పించారు. పొదుగు వాపు వ్యాధి నిర్ధారణను గుర్తించి నివారణకు ద్రావణాన్ని ఎలా తయారు చేయాలో వివరించారు. వర్సిటీ పశువైద్య విద్య శాస్త్రవేత్త గంగరాజు, డీఆర్‌డీఏ అధికారిణి కోమలాదేవి, రామ్మోహన్ పాల్గొన్నారు.

హైదరాబాద్‌కు ఏసీ సర్వీసు బస్సు ప్రారంభం



బస్సును ప్రారంభిస్తున్న అధికారులు

తిరుపతి అర్బన్: తిరుపతి నుంచి హైదరాబాద్‌కు ఏర్పాటుచేసిన ఏసీ వెన్నెల బస్సును జిల్లా ప్రజా రవాణా అధికారి చెంగల్‌రెడ్డి, డిపో మేనేజర్ బాలాజీ శుక్రవారం రాత్రి ప్రారంభించారు. ఇందులో టికెట్ ధరలో 20 శాతం రాయితీ ఇస్తున్నారు. ఈ సర్వీసు ప్రతి రోజూ రాత్రి 9.30 గంటలకు తిరుపతిలో బయలుదేరి కడప, కర్నూలు మీదుగా ఉదయం 6.45 గంటలకు హైదరాబాద్ చేరుకుంటుంది. అదేవిధంగా హైదరాబాద్‌లో రాత్రి 9.30 గంటలకు బయలుదేరి మరుసటి రోజు ఉదయం 6.45 గంటలకు చేరుకుంటుంది.

లైసెన్స్ కోసం యువత పరుగులు





డ్రైవింగ్ టెస్ట్ కోసం ట్రాక్ వద్ద వేచి ఉన్న యువకులు, వాహనదారులు, ట్రాక్‌లో డ్రైవ్ చేస్తున్న యువకులు

- భారీ జరిమానాలతో యువతలో మార్పు
- ఫలిస్తున్న అధికారుల ప్రయత్నాలు
- నిబంధనలు పాటించాలంటున్న అధికారులు

జిల్లా రవాణా శాఖ అధికారులు, పోలీసులు తీసుకుంటున్న చర్యలు ఫలితాలనిస్తున్నాయి. లైసెన్స్ తీసుకోవడానికి యువకులు ఉత్సాహం చూపుతున్నారు. తిరుపతి జిల్లాలోని మంగళం, శ్రీకాళహస్తి, వెంకటగిరి, సూళ్లూరుపేట, గూడూరు ప్రాంతాల్లోని రవాణా శాఖ కార్యాలయాల వద్దకు పరుగులు తీస్తున్నారు. డ్రైవింగ్ లైసెన్స్‌లు కోసం వచ్చే యువతతో కార్యాలయాలు కిటకిటలాడుతున్నాయి. –తిరుపతి మంగళం

యువత వాహనాలు కొనుగోలు చేయడంలో చూపుతున్న ఆసక్తి, లైసెన్స్‌లు తీసుకోవడంలో చూపడంలేదన్నది పాత కథ. వాహనం కొనుగోలు చేసిన వెంటనే డ్రైవింగ్ లైసెన్స్ తీసుకోవాలన్న ఆలోచన యువతలో మొదలైంది. కొంతమంది నెట్‌షాపుల్లో, సీఎస్‌సీ సెంటర్లలో లైసెన్స్ కోసం స్లాట్ బుక్ చేసుకుంటున్నారు. మరికొందరు నేరుగా తమ ఫోన్లలోనే స్లాట్ బుక్ చేసుకుని ఎల్ఎల్ఆర్ టెస్ట్‌కు వెళుతున్నారు. ఆరు నెలల వరకు ఎల్ఎల్ఆర్ వినియోగించుకునే అవకాశం ఉన్నా నెల వ్యవధిలోనే డ్రైవింగ్ లైసెన్స్ పొందేందుకు ఆన్‌లైన్‌లో డ్రైవింగ్ టెస్ట్‌కు డబ్బులు చెల్లించి టెస్ట్‌లో పాల్గొంటున్నారు.



డ్రైవింగ్ టెస్ట్ పరిశీలిస్తున్న ఎంవీఐ కుసుమ

రోడ్డు ప్రమాదాలు, వాహనాల తనిఖీలతోనే మార్పు

తల్లిదండ్రులు తమ పిల్లలకు రూ.లక్షలు ఖర్చు పెట్టి వాహనాలు కొనుగోలు చేయడంలో చూపుతున్న ఆసక్తి లైసెన్స్‌లు తీసివ్వడంలో చూపలేదు. యువత కూడా నిర్లక్ష్యం వహించారు. రోడ్డు ప్రమాదాలపై రవాణా, పోలీసు అధికారులు అవగాహన కార్యక్రమాలు ముమ్మరం చేశారు. అంతేగాక తనిఖీలు చేపట్టి నిబంధనలు పాటించని వారికి భారీ జరిమానా విధించడం మొదలు పెట్టారు. దీంతో తల్లిదండ్రులతోపాటు యువతలో కూడా మార్పు వచ్చింది. డ్రైవింగ్ లైసెన్స్ తీసుకోవడం ద్వారా అన్ని సమస్యలు పరిష్కారమవుతాయన్న అధికారుల సూచనలతో యువత రవాణా కార్యాలయాల వద్ద క్యూలు కడుతున్నారు.

లైసెన్స్‌ల వివరాలు	రోజుకు	నెలకు
తిరుపతిలో	50-60	165
శ్రీకాళహస్తిలో	35	105
గూడూరులో	30	90
సూళ్లూరుపేటలో	40	120

నిబంధనలు పాటించి ప్రమాదాలను అరికట్టాలి



వాహనాలు నడిపేటప్పుడు తప్పనిసరిగా నిబంధనలు పాటించాలి. తద్వారా రోడ్డు ప్రమాదాలను నివారించవచ్చు. యువత 200 సీసీ, 250 సీసీ బైక్‌లపై వేగంగా వెళుతుంటారు. చిన్నపాటి నిర్లక్ష్యం కూడా పెద్ద నష్టాన్ని కలిగిస్తుంది. తల్లిదండ్రుల ఆశలను గుర్తు పెట్టుకుని యువకులు జాగ్రత్తలు పాటించాలి.

– సీతారామిరెడ్డి, జిల్లా రవాణాశాఖాధికారి

మరింత బాధ్యతగా పనిచేస్తాం



ఎమ్మెల్యే చెవిరెడ్డి భాస్కర్‌రెడ్డికి కృతజ్ఞతలు తెలుపుతున్న ఉపేంద్రరెడ్డి



ఎమ్మెల్యే చెవిరెడ్డికి పుష్పగుచ్ఛం అందజేస్తున్న చేగు ప్రశాంత్ గుప్తా

తిరుపతి రూరల్: వైఎస్సార్ సీపీ అధ్యక్షుడు, ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి తనపై నమ్మకంతో అప్పగించిన జిల్లా స్థాయి బాధ్యతను మరింత నమ్మకంతో నెరవేర్చుతానని వైఎస్సార్ టీయూసీ తిరుపతి జిల్లా అధ్యక్షుడు ఉపేంద్రరెడ్డి తెలిపారు. ఆయన శనివారం ప్రభుత్వ విప్ చెవిరెడ్డి భాస్కర్ రెడ్డిని తిరుపతిలో కలిసి కృతజ్ఞతలు తెలిపారు. పార్టీకి, చెవిరెడ్డి భాస్కర్‌రెడ్డికి జీవితాంతం విధేయులుగా ఉంటామని తెలిపారు. ముఖ్యమంత్రి జగన్‌మోహన్‌రెడ్డి ప్రభుత్వం కార్మికుల సంక్షేమం కోసం అమలు చేస్తున్న ప్రతి పథకమూ అర్హులైన కార్మికులకు అందించడమే ప్రథమ లక్ష్యంగా పనిచేస్తానన్నారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే చెవిరెడ్డి జిల్లా అధ్యక్షుడుగా నియమితులైన ఉపేంద్రరెడ్డిని అలింగనం చేసుకుని అభినందించారు. కార్యక్రమంలో ఎంపీపీ మోహిత్‌రెడ్డి, వైస్ ఎంపీపీ విడుదల మాధవరెడ్డి, వైఎస్సార్ సీపీ మాజీ మండల అధ్యక్షుడు మూలం చంద్రమోహన్‌రెడ్డి, అజయ్‌కుమార్‌రెడ్డి, రామచంద్రయ్య, నాయకులు పాల్గొన్నారు.

ఎమ్మెల్యే చెవిరెడ్డిని కలిసిన జిల్లా అనుబంధ విభాగం అధ్యక్షులు

చంద్రగిరి: వైఎస్సార్‌సీపీ అనుబంధ వాణిజ్య విభాగం తిరుపతి జిల్లా అధ్యక్షుడు చేగు ప్రశాంత్ గుప్తా, యువజన విభాగం అధ్యక్షుడు అజయ్ కుమార్ శనివారం పార్టీ అనుబంధ విభాగాల రాష్ట్ర సమన్వయకర్త, ఎమ్మెల్యే చెవిరెడ్డి భాస్కర్ రెడ్డిని కలిసి కృతజ్ఞతలు తెలిపారు. పార్టీ అభ్యున్నతికి చిత్తశుద్ధితో కృషి చేయాలని ఆయన వారికి సూచించారు. అలాగే వైద్య విభాగం రాష్ట్ర అధ్యక్షుడు బత్తుల అశోక్‌కుమార్‌రెడ్డి ఎమ్మెల్యేను కలిసి కృతజ్ఞతలు తెలిపారు.

బ్రాహ్మణ కుటుంబానికి పుట్టింటి సారె

తిరుపతి కల్చరల్: తిరుపతికి చెందిన డీఎస్.రమేష్, ఇందుమతి కుమార్తె సుదీప్తి వివాహానికి శనివారం తిరుపతి బ్రాహ్మణ సమాజం ఆధ్వర్యంలో శనివారం తాళిబొట్టుతోపాటు పుట్టింటి సారె అందజేశారు. అలాగే తిరుపతి, నెల్లూరు సమాజం సభ్యులు, దాతల సహకారంతో రూ.20,000 నగదు అందజేశారు. కార్యక్రమంలో సమాజం ప్రధాన కార్యదర్శి కొత్తపల్లి అజయ్‌కుమార్, కోశాధికారి ప్రభాకర్, రాష్ట్ర యువజన అధ్యక్షుడు వేదం హరిప్రసాద్, రాయలసీమ కన్వీనర్ జీఆర్.పుష్పలత, జిల్లా మహిళా కార్యదర్శి సరళ పాల్గొన్నారు.



తాళిబొట్టు, పుట్టింటి సారె అందజేస్తున్న బ్రాహ్మణ సమాజం ప్రతినిధులు

28న మండల సర్వసభ్య సమావేశం

పాకాల: స్థానిక ఎంపీడీఓ కార్యాలయంలో 28న మండల సర్వసభ్య సమావేశం నిర్వహించనున్నట్టు ఎంపీడీఓ రమేష్‌బాబు తెలిపారు. ఎమ్మెల్సీ ఎన్నికల కోడ్ ఉన్న నేపథ్యంలో సమావేశంలో ఎలాంటి నిర్ణయాలు, ప్రతిపాదనలు, చర్చలు చేయకూడదని పేర్కొన్నారు. ప్రజా ప్రతినిధులు, అధికారులు, పంచాయతీ కార్యదర్శులు తప్పక హాజరుకావాలని కోరారు.

మామిడి తోటల పరిశీలన



మామిడి తోటలను పరిశీలిస్తున్న ఎస్.శైలజ

పాకాల: వాతావరణంలో కలుగుతున్న మార్పులతో మామిడికి తెగులు సోకే అవకాశం ఉందని, రైతులు తగిన చర్యలు తీసుకోవాలని ఉద్యాన అధికారిణిని ఎస్.శైలజ తెలిపారు. ఆమె శనివారం జింకలమిట్ట, దామలచెరువు పరిసర ప్రాంతాల్లోని మామిడి తోటలను పరిశీలించారు. ఆమె మాట్లాడుతూ ప్రస్తుతం ఉష్ణోగ్రతలు పెరగడంతోపాటు గాలిలో తేమ శాతం ఎక్కువ కావడంతో తేనెమంచు పురుగు, తామర పురుగు ఉధృతి అధికంగా ఉంటుందన్నారు. వీటి నివారణకు బుప్రొపెజిన్ 15 శాతం, ఎసిపేట్ 35 శాతం కాంబినేషన్‌లో లభించే పురుగు మందును 1.5 గ్రాములు, కార్బనిజం, మంకోజబ్ కాంబినేషన్‌లో లభించే తెగులు మందు 1.5 గ్రాములు, ప్లానోఫిక్స్ 0.2 మిల్లీల, గమ్ 0.5 మిల్లీలు కలిపి కాండము, కొమ్మలు బాగా తడిచేలాగా పిచికారీ చేయాలని సూచించారు.

జాతీయ ఉద్యానవన పంటల మెళాలో మండల రైతులు



గ్రేడింగ్ విధానాన్ని పరిశీలిస్తున్న రైతులు

భాకరాపేట: బెంగళూరులో జరిగిన జాతీయ ఉద్యానవన పంటల మేళాకు చిన్నగొట్టిగల్లు మండలంలోని చిట్టేచెర్ల, దేవరకొండ, దీన్‌దార్లపల్లె, చెరువు ముందరపల్లె గ్రామాలకు చెందిన 30 మంది రైతులు వెళ్లారు. వారికి రాస్-కేవీకే శాస్త్రవేత్త పీఎస్ సుధాకర్ కొత్త సాగు పద్ధతులు, నూతన వంగడాలు, నూతన సాంకేతిక పరిజ్ఞానం, (విలువ జోడింపు ఉత్పత్తులు), పనిముట్లు, కోత పరికరాలు, గ్రేడింగ్, పండ్లు మాగించి నిల్వ చేసే పద్ధతులపై అవగాహన కల్పించారు.

ఓపెన్ ఇంటర్‌లో ప్రవేశానికి దరఖాస్తులు

చంద్రగిరి: ఓపెన్ ఇంటర్మీడియట్‌లో ప్రవేశాలని దరఖాస్తు చేసుకోవాలని ప్రభుత్వ బాలికల జూనియర్ కళాశాల ప్రిన్సిపాల్ రాజశేఖర్ రెడ్డి శనివారం తెలిపారు. 10వ తరగతి పాసై, ఇంటర్మీడియట్‌లో చేరి మధ్యలోనే మానేసిన విద్యార్థులు(బాలికలు) తిరిగి కళాశాలలో చేరడానికి దరఖాస్తు చేసుకోవచ్చన్నారు. ఆసక్తి కలిగిన వారు 10వ తరగతి మార్కుల మెమో, కుల, ఆదాయ ధ్రువీకరణ సర్టిఫికెట్లు, ఆధార్ కార్డు జిరాక్స్ తీసుకుని సోమవారం కళాశాలలో సంప్రదించాలని కోరారు. అదే విధంగా ఓపెన్ ఇంటర్మీడియట్‌లో చేరాలని కోరుకునే బాలురు తమ సమీప ప్రభుత్వ కళాశాలలో ప్రిన్సిపాల్‌ను సంప్రదించాలని సూచించారు.

అభివృద్ధిని చూసి ఓర్వలేకే లోకేష్ విమర్శలు

తిరుపతి కల్చరల్: అభివృద్ధిని చూసి ఓర్వలేకే డిప్యూటీ మేయర్ భూమన అభినయ్‌రెడ్డిపై నారా లోకేష్ పసలేని విమర్శలు చేస్తున్నారని వైఎస్సార్ సీపీ యువజన విభాగం జిల్లా అధ్యక్షుడు ఆర్ఏ.అజయ్‌కుమార్, టౌన్ బ్యాంకు వైస్ చైర్మన్ వాసుయాదవ్ మండిపడ్డారు. వారు శనివారం ప్రెస్‌క్లబ్‌లో విలేకరులతో మాట్లాడారు. దగ్గుపాటి వెంకటేశ్వరావు రాసిన ఒక చరిత్ర – కొన్ని నిజాలు పుస్తకంలో నాటు సారా కాంట్రాక్ట్ కోసం ఎన్‌టీఆర్ వద్ద లాబీయింగ్ చేసిన చరిత్ర చంద్రబాబుదని పేర్కొన్నారు. తిరుపతికి ఇద్దరు ఎమ్మెల్యేలు అని లోకేష్ మాట్లాడడాన్ని చూస్తే ఆయన రాజకీయ పరిజ్ఞానం ఏపాటిదో అర్థమవుతుందన్నారు. నిరంతరం ప్రజా సంక్షేమం, తిరుపతి నగర అభివృద్ధి కోసం శ్రమిస్తున్న భూమన అభినయ్‌రెడ్డికి వస్తున్న ప్రజాదరణను చూసి ఓర్వలేక లోకేష్‌కు మతి భ్రమించి మాట్లాడుతున్నారని పేర్కొన్నారు. వెన్నుపోటు, భూ కబ్జాలకు కేరాఫ్ టీడీపీ అని విమర్శించారు. తమ యువనేత భూమన అభినయ్‌రెడ్డిపై లేనిపోని విమర్శలు చేస్తే పరిణామాలు తీవ్రంగా ఉంటాయన్నారు. రాష్ట్ర మైనారిటీ కార్పొరేషన్ డైరెక్టర్ ఇమ్రాన్, వైఎస్సార్ సీపీ యువజన విభాగం నేతలు ఉదయ్ వంశీ, అనిల్‌రెడ్డి, పసుపులేటి సురేష్ పాల్గొన్నారు.



మాట్లాడుతున్న అజయ్‌కుమార్

కాపు నేత వీరన్నకు సత్కారం



తిరుపతి కల్చరల్: తిరుమల శ్రీవారి దర్శనార్థం విచ్చేసిన రాయలసీమ కాపునాడు అధ్యక్షుడు వీరన్నను శనివారం కాపు నేతలు ఘనంగా సత్కరించారు. ఆయన అనంతవీధిలోని కాపునాడు కార్యాలయానికి వచ్చారు. సత్కరించిన వారిలో కాపునాడు తిరుపతి పార్లమెంట్ అధ్యక్షుడు ఎన్వీ సురేష్ రాయల్, జిల్లా అధ్యక్షురాలు, జిల్లా గ్రంథాలయ చైర్మన్ నైనారు మధుబాల, నగర అధ్యక్షురాలు గల్లా కవిత, కార్యదర్శి రాధ ఉన్నారు.

నేటి నుంచి తిరుపతిలో హస్తకళా ప్రదర్శన

తిరుపతి కల్చరల్: చేనేత జౌళి మంత్రిత్వ శాఖ సౌజన్యంతో చిత్తూరు హ్యాండీ క్రాఫ్ట్స్ ప్రొడ్యూసర్స్ సంస్థ ఆధ్వర్యంలో ఆదివారం నుంచి మార్చి 6వ తేదీ వరకు తిరుపతిలో హస్తకళా ప్రదర్శన చేపడుతున్నట్లు ఆ సంస్థ మేనేజింగ్ డైరెక్టర్ గుమ్మిడి పూడి దశరథాచారి తెలిపారు. ఆయన శనివారం ప్రెస్ క్లబ్‌లో విలేకరులతో మాట్లాడారు. ఖాదీ కాలనీలో ఉన్న శివశక్తి కల్యాణ మండపంలో ఏర్పాటు చేసిన హస్తకళా ప్రదర్శనను ఆదివారం మధ్యాహ్నం టీటీడీ బోర్డు సభ్యుడు పోకల అశోక్‌కుమార్, హస్తకళాసేవా విస్తార కేంద్రం అసిస్టెంట్ డైరెక్టర్ టి.సత్యమూర్తి ప్రారంభిస్తారని తెలిపారు. ఇందులో కొయ్య బొమ్మలు, కడప జిల్లాలోని రాజా రాణి బొమ్మలు, కళంకారీ తదితరాలు సరసమైన ధరలకు విక్రయిస్తామన్నారు. హ్యాండీక్రాఫ్ట్ ప్రొడ్యూసర్స్ సంస్థ ప్రతినిధులు శేషబాబు, కె.వాసుకుమార్, కేవీ.రాజు, రాజేంద్ర, బాబు, ఈశ్వర్, సునీల్ తదితరులు పాల్గొన్నారు.



మాట్లాడుతున్న గుమ్మిడిపూడి దశరథాచారి

ఆసక్తికరంగా సాగుతున్న శతావధానం

తిరుపతి కల్చరల్: విశ్వశ్రీ సాహితీ సమాఖ్య ఆధ్వర్యంలో అధ్యక్షుడు గార్లపాటి దామోదర నాయుడు సంచాలకుడిగా జాతీయ సంస్కృత విశ్వవిద్యాలయంలో అవగాధని ఆముదాల మురళి సంపూర్ణ శతావధానం రెండో రోజు శనివారం ఆసక్తికరంగా సాగింది. ఉదయం వర్సిటీ వీసీ ఆచార్య రాణి సదాశివమూర్తి అధ్యక్షతన రామకృష్ణ మఠం కార్యదర్శి స్వామి సుకృతానంద, ఆచార్య సర్వోత్తమరావు, కేవీ.చౌదరి హాజరయ్యారు. వారు మాట్లాడుతూ తెలుగు భాషలో అవధాన ప్రక్రియ అపూర్వమని కొనియాడారు. ఆచార్య దామోదరనాయుడు అధ్యక్షతన మధ్యాహ్నం జరిగిన సమావేశానికి ముఖ్య అతిథిగా భారతీయ విద్యాభవన్ డైరెక్టర్ సత్యనారాయణరాజు, చెక్రీ రెసిడెన్సీ అధినేత లెక్కల నాగరాజ నాయుడు, తోట వెంకటేశ్వర్లు, తెలుగు భాషోద్యమ సమితి టెంకాయల దామోదరం హాజరై శతావధానం క్రతువును ఆశ్వాదించారు.

జనమిత్ర ఉద్యోగుల ఆత్మీయ సమావేశం

తిరుపతి కల్చరల్: జనమిత్ర ఇన్ ఫ్రా డెవలపర్స్ ఉద్యోగుల ఆత్మీయ సమావేశం శనివారం ఓ ప్రైవేటు హోటల్‌లో ఘనంగా నిర్వహించారు. ఇందులో ముఖ్య అతిథులుగా తిరుపతి ఫిలిం సొసైటీ చైర్మన్ ఎం.వేణుగోపాల్‌రెడ్డి, లయన్స్ క్లబ్ అధ్యక్షుడు ఆర్కాట్ కృష్ణప్రసాద్ హాజరై ప్రసంగించారు. జనమిత్ర చైర్మన్ శివారెడ్డి ఉద్యోగులను గుర్తించి వారి కుటుంబ సభ్యులతో ఆత్మీయ కలయికను ఏర్పాటు చేసి బహుమతులతో ప్రోత్సహించడం సంతోషకరమన్నారు. జనమిత్ర చైర్మన్ శివారెడ్డి తన వ్యాపారంలో కొంత సొమ్మును పేద ప్రజల కోసం వినియోగిస్తూ సమాజ శ్రేయస్సుకు కృషి చేయడం అభినందనీయమని కొనియాడారు. అనంతరం జనమిత్ర చైర్మన్ శివారెడ్డి దంపతులను సత్కరించారు. ఈ కార్యక్రమంలో విశ్వ హిందూ పరిషత్ సభ్యురాలు సుమితిరెడ్డి, మిమిక్రీ విజయకుమార్, శేషగిరి, నామా రాజేష్, దొరస్వామి రాజు, చరణ్ పాల్గొన్నారు.



జనమిత్ర చైర్మన్ శివారెడ్డి దంపతులను సత్కరిస్తున్న అతిథులు, ఉద్యోగులు

ఇండోర్ స్టేడియం పనుల జాప్యంపై కమిషనర్ ఆగ్రహం

తిరుపతి తుడా: ఇందిరా మైదానంలో చేపట్టిన ఇండోర్ స్టేడియం నిర్మాణ పనుల జాప్యంపై తిరుపతి మున్సిపల్ కార్పొరేషన్ కమిషనర్ అనుపమ అంజలి ఆగ్రహం వ్యక్తం చేశారు. ఆమె శనివారం ఇండోర్ గేమ్స్ కోసం ఏర్పాటు చేసిన వివిధ కోర్టులను పరిశీలించారు. పనులు నత్త నడకన సాగుతుండడంపై మండిపడ్డారు. పనులు వేగవంతంగా పూర్తి చేయని పక్షంలో శాఖాపరమైన చర్యలు తీసుకుంటామని కాంట్రాక్టర్లను హెచ్చరించారు. ఆమె మాట్లాడుతూ రూ.ఏడు కోట్ల స్మార్ట్ సిటీ నిధులతో ఇండోర్ స్టేడియంలో షటిల్, కబాడి, బాస్కెట్ బాల్, జిమ్నాస్టిక్ కోర్టులు నిర్మిస్తున్నట్లు తెలిపారు. ఎస్ఈ మోహన్, మున్సిపల్ ఇంజినీర్ చంద్రశేఖర్, ఎయికామ్ సంస్థ ప్రతినిధి బాలాజీ పాల్గొన్నారు.



కాంట్రాక్టర్, ఇంజినీర్లతో మాట్లాడుతున్న కమిషనర్

జాతీయ క్రికెట్‌కు అకార్డ్ విద్యార్థి



ముచ్చెలి హర్షవర్ధన్‌రెడ్డి

తిరుపతి రూరల్: అండర్-14 జాతీయ క్రికెట్ పోటీలకు తిరుపతి అకార్డ్ స్కూల్ విద్యార్థి ముచ్చెలి హర్షవర్ధన్‌రెడ్డి ఎంపికయ్యారు. స్కూల్ గేమ్స్ ఫెడరేషన్(ఎస్‌జీయఫ్) ఆధ్వర్యంలో మచిలీపట్నంలో మూడు రోజులుగా రాష్ట్ర స్థాయి అండర్-14 క్రికెట్ పోటీలు జరుగుతున్నాయి. ఇందులో ఆడిన మూడు మ్యాచుల్లో అద్భుత ప్రతిభ చూపిన హర్షవర్ధన్‌రెడ్డి జిల్లా నుంచి జాతీయ స్థాయి పోటీలకు ఎంపికయ్యారు. 20 మందితో కూడిన టీమ్‌కు ఏప్రిల్ 20 నుంచి మచిలీపట్నంలో ప్రత్యేక క్యాంప్ నిర్వహించనున్నారు. జాతీయ స్థాయి పోటీలకు ఎంపికైన హర్షవర్ధన్‌రెడ్డిని అకార్డ్ విద్యా సంస్థల చైర్మన్ చంద్రశేఖర్‌రెడ్డి, డైరెక్టర్లు ప్రశాంత్, వివేక్, శ్రీనివాస క్రికెట్ అకాడమీ కోచ్ వాసులు అభినందించారు.

హైకోర్టు జడ్జిని కలిసిన న్యాయవాదులు

తిరుపతి లీగల్: శ్రీవారి దర్శనార్థం తిరుపతికి వచ్చిన రాష్ట్ర హైకోర్టు న్యాయమూర్తి జస్టిస్ గోపాలకృష్ణారావును శనివారం రాత్రి తిరుపతి న్యాయవాదులు మర్యాదపూర్వకంగా కలిశారు. శాలువతో సన్మానించి జ్ఞాపికను అందజేశారు. తిరుపతి న్యాయవాదుల సంఘ ఉపాధ్యక్షుడు మురళీమోహన్, ప్రధాన కార్యదర్శి హరనాథనాయుడు, ఇతర న్యాయవాదులు పాల్గొన్నారు.



హైకోర్టు జడ్జిని సన్మానిస్తున్న న్యాయవాదులు

కారు ఢీకొని ముగ్గురికి గాయాలు

చంద్రగిరి: పట్టణంలోని కొత్తపేట ప్రభుత్వ పశువైద్యశాల వద్ద శనివారం కారు ఢీకొని ముగ్గురు గాయపడ్డారు. పోలీసుల కథనం మేరకు.. తమిళనాడు వేలూరుకు చెందిన సెంథిల్ కుమార్ కుటుంబ సభ్యులతో కలిసి తిరుమల శ్రీవారిని దర్శించుకున్నారు. శనివారం ఉదయం వేలూరుకు కారులో బయలుదేరారు. చంద్రగిరి కొత్తపేట ప్రభుత్వ పశువైద్యశాల వద్ద వాహనం నడుపుతున్న సెంథిల్ కుమార్ నిద్రలోకి జారుకోవడంతో ఎదురుగా వస్తున్న ద్విచక్ర వాహనాన్ని, తర్వాత ఆటోను ఢీకొన్నాడు. వారి వెనుకే మరో ద్విచక్ర వాహనంలో వస్తున్న ఈశ్వర్ రెడ్డి వాహనాన్ని బలంగా ఢీకొనడంతో ఆయన ఎగిరి కారు అద్దంపై పడ్డాడు. పోలీసులు అక్కడికి చేరుకుని ఈశ్వర్ రెడ్డితో పాటు తిరుపతికి చెందిన ఆటో డ్రైవరు రాముడు, పేరూరుకు చెందిన శరవణను 108లో రుయా ఆస్పత్రికి తరలించారు. కారును పోలీసు స్టేషన్‌కు తరలించారు. కేసు దర్యాప్తులో ఉంది.

తిరుచ్చిపై కల్యాణ వెంకన్న చిద్విలాసం

చంద్రగిరి: శ్రీనివాసమంగాపురంలోని కల్యాణ వెంకటేశ్వర స్వామి శనివారం సాయంత్రం తిరుచ్చిపై ఊరేగుతూ భక్తులకు అభయమిచ్చారు. ఉదయం స్వామి వారిని సుప్రభాతంతో మేల్కొలిపి నిత్య కైంకర్యాలు నిర్వహించారు. అనంతరం విశేషంగా అలంకరించి భక్తులకు దర్శనం కల్పించారు. సాయంత్రం ఊంజల్ సేవను కనుల పండువగా చేపట్టారు. అనంతరం శ్రీదేవి, భూదేవి సమేత కల్యాణ వెంకటేశ్వరస్వామి తిరుచ్చిపై ఆశీనులై నాలుగు మాడ వీధుల్లో ఊరేగుతూ భక్తులకు దర్శనమిచ్చారు. భక్తులు పెద్ద సంఖ్యలో తరలివచ్చి స్వామిని దర్శించుకున్నారు.



తిరుచ్చిపై ఊరేగుతూ భక్తులను కటాక్షిస్తున్న కల్యాణ వెంకటేశ్వర స్వామి

కాపు, బలిజ ద్రోహులు బాబు, లోకేష్

తిరుపతి కల్చరల్: కాపు, బలిజల ద్రోహులు చంద్రబాబు నాయుడు, నారా లోకేష్ అని జేసీఎస్ అధ్యక్షుడు, కాపు బలిజ ఉద్యమ నేత బాలిశెట్టి కిషోర్ శనివారం ఒక ప్రకటనలో ఆరోపించారు. గతంలో కాపు బలిజల సమస్యలపై కాపు నేతలు చేపట్టిన ఉద్యమాలను నీరుగార్చి కక్ష్య సాధింపు చర్యలకు పాల్పడిన చరిత్ర చంద్రబాబునాయుడిదని పేర్కొన్నారు. ముద్రగడ పద్మనాభంతోపాటు ఎమ్మెల్యే భూమన కరుణాకరరెడ్డి, భూమన అభినయ్‌రెడ్డిని విచారణల పేరుతో వేధించారని తెలిపారు. టీడీపీ అరాచక పాలనపై విరక్తి చెందిన ప్రజలు గత ఎన్నికల్లో గుణపాఠం చెప్పినా అధికార దాహంతో మళ్లీ తప్పుడు ప్రచారం చేస్తున్నారని దుయ్యబట్టారు.